క్లుప్తంగా

విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు



ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

పెనుకొండ: పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బైబిల్ మిషన్ మోక్ష మార్గోపదేశ సభలు చర్చిలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో బైబిల్ మిషన్ చర్చి ప్రతినిధులు జాన్సన్, డోన్‌కు చెందిన బందెల రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవులందరూ ఒకరిపై ఒకరు ప్రేమ, దయాగుణం, నీతి, సోదరభావం కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి పాస్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సికిల్ సెల్ అనీమియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యుడు ఓంకార్ మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వారసత్వంగా సంక్రమిస్తుందని తెలిపారు. ప్రధానంగా రక్తహీనతతో రోగి దీర్ఘకాలం పాటు బాధపడే అవకాశం ఉందన్నారు. వ్యాధి నివారణకు వైద్యులు సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పిల్లలు పనిలో కాదు... బడిలో ఉండాలి



రొద్దంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రొద్దం: పిల్లలను పనిలోకాదు బడిలో చేర్పించాలని ఎంఈఓ–2 జయభాస్కర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన వీధుల్లో ×నేను బడికి పోతా₹ అనే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని నినాదిస్తూ అవగాహన ర్యాలీ చేపట్టారు. పిల్లలను బడుల్లో చేర్పించాలని ఎంఈఓ కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడూరుకు రూ. 5.58 లక్షల ఆదాయం

చిలమత్తూరు: మండల పరిధిలోని కోడూరు పంచాయతీ పరిధిలో కోడూరు పెద్ద చెరువులో చేపల పెంపకానికి, వారపు సంత నిర్వహణకు బుధవారం వేలంపాట నిర్వహించారు. సర్పంచ్ మురళీమోహన్ మాట్లాడుతూ పెద్ద చెరువును గంగాధర్ అనే వ్యక్తి రూ.5.13 లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నారని చెప్పారు. అలాగే వారపు సంతను రూ.45,500 కు శివానంద అనే వ్యక్తి దక్కించుకున్నట్లు తెలిపారు.

నేడు చిలమత్తూరులో.....

మండలంలోని చిలమత్తూరు పంచాయతీ పరిధిలోని వారపుసంత, బస్టాండ్, జంతు వధ శాల, షాపింగ్ కాంప్లెక్స్ రూములకు గురువారం వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి రామ్లానాయక్ తెలిపారు.

పోషకాల రేడు.. నేరేడు

- ప్రస్తుత సీజన్‌లో విరివిగా లభ్యం
- ఆరోగ్య ఫల ప్రదాయినిగా గుర్తింపు

హిందూపురం/చిలమత్తూరు/మడకశిరరూరల్: మనం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే.. ప్రకృతి సిద్ధంగా లభించే ఆహార పదార్థాలు ఎంచుకుంటే చాలు. అలాంటి పండ్లలో నేరేడు ఒకటి. ప్రస్తుత సీజన్‌లో నేరేడు పండ్లు అన్ని చోట్లా విరివిగా లభిస్తున్నాయి. నోట్లో వేసుకోగానే ఇట్టే కరిగిపోయే ఈ పండు పోషకాల గని.. అనారోగ్యాల నివారణి అని వైద్యులు చెబుతున్నారు.



నోరూరించే నేరేడు పండ్లు



దేమకేతేపల్లి వద్ద నేరేడు పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రయాణికుడు

కిలో రూ.200 నుంచి రూ.250

ప్రకృతి ప్రసాదించే ఆహార పదార్థాల్లో ఒకటి నేరేడు. ఆరోగ్య ఫల ప్రదానియగా పిలిచే అల్ల నేరుడు పండును సక్రమంగా వినియోగించుకుంటే ఆరోగ్యానికి సంపూర్ణంగా మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. కోతకు వచ్చిన నేరుడు పండ్లు కోయడం చాలా కష్టంగా ఉంటుండడంతోనే ధర కూడా అధికంగా ఉంటుంది. వ్యవసాయ బోరు బావుల కింద రైతులు పెంచుకున్న నేరుడు చెట్లను కొనుగోలు చేసి ఆయా పట్టణాల్లో నాణ్యతను బట్టి కేజీ రూ. 200 నుంచి రూ.250 దాకా విక్రయిస్తున్నారు.

మెండుగా ప్రయోజనాలు

- నేరేడు పండ్లు జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు కల్గిస్తాయి.
- నేరేడులో పోటాషియం అధిక ఉంటుంది. ప్రతి వంద గ్రాముల పండ్లలో 55 మిల్లీగ్రాముల పోటాషీయం లభిస్తుంది.
- యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు వల్ల పళ్లు, చిగుళ్ల గట్టి దనాన్ని అందిస్తాయి.
- శరీరం డీ హైడ్రేషన్ కాకుండా ఇవి బాగా పనిచేస్తాయి.
- విటమిన్ సీ పుష్కలంగా ఉండటంతో రోగనిరోధక శక్తి పెంపొందిస్తాయి.
- క్యాల్షియం అధికంగా ఉండటం వల్ల ఎముకలకు బలాన్ని ఇస్తాయి.
- నేరేడు పండ్లు తింటే శ్వాసకోశ సంబంధ వ్యాదులు దూరమవుతాయి.
- మధుమేహ బాధితులకు నేరేడు వరంలా పనిచేస్తుంది. గ్లైకమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల డయాబెటిస్ వ్యాధికి చక్కగా ఉపయోగపడతాయి. నేరేడు పండ్లను తినడంతో పాటు గింజల్ని ఎండబెట్టి పొడిగా చేసుకొని నీటిలో కలుపుకొని తాగితే చక్కెర వ్యాధి తగ్గుతుంది.
- నేరుడు పండుతో పాటు నేరుడు బెరడు, ఆకులలోన కూడా వ్యాధులను నివారించే గుణాలు ఉన్నాయి. ఆహారంతో పాటు అనుకోకుండా వెంట్రుకలు కడుపులోకి వెళతాయి. అవి లోపలకి వెళ్లి ప్రేగులలో చుట్టుకోకుండా నేరేడు పండు తినడం వల్ల పేగులలో చుట్టుకున్న వెంట్రుకలను కూడా బయటకు పంపించే శక్తి నేరేడుకు ఉందని వైద్యులు చెబుతున్నారు.
- కిడ్నీలో ఉన్న రాళ్లను నివారించే గుణాలు నేరేడు పండులో ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. తరుచూ నేరేడు పండ్లు తింటే లివర్ శుభ్రం అవుతుంది.

బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న పీడీ లక్ష్మీకుమారి

పెనుకొండ: బాల్య వివాహాలపై ప్రజలు తగిన సమాచారం అందించి సహకారం అందించాలని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పిలుపునిచ్చారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని భువన విజయం సమావేశపు భవనంలో బుధవారం బాల్య వివాహాల నిర్మూలనపై ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల్య వివాహాల నియమ నిబంధనలు, బాలల చట్టాలపై మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ లక్ష్మీ కుమారి మాట్లాడుతూ గతంలో బాల్య వివాహాల నిర్మూలనకు తగిన అధికార యంత్రాంగం లేదని, అయితే కొత్తగా వచ్చిన జీఓ మేరకు సిబ్బందిని పెంచడం జరిగిందన్నారు. అధికార యంత్రాంగం బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే స్థానికులు సైతం 1098 లేకపోతే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామస్థాయిలోని అధికారులు పకడ్బందీగా దీన్ని అమలు చేయాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి మహేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

6న తుంగభద్ర తాగునీటి పథకం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: తుంగభద్ర తాగునీటి పథకాన్ని జూలై 6న సీఎం సిద్ధరామయ్య ప్రారంభిస్తారని స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్ తెలిపారు. తాలూకాలోని తిరుమణి గ్రామంలో రూ 76.6 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవనం, రూ 29.5 లక్షలతో నిర్మించనున్న నూతన పశువుల ఆస్పత్రి నిర్మాణాలకు ఆయన బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుమణి ప్రాంతంలో సోలార్ పార్క్ ఉండడంతో ఈ ప్రాంతంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. సుమారు రూ.8 కోట్లతో సీసీ రోడ్లు వేయించామన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి డీపీఆర్ చేయాలని సీఎం సిద్ధరామయ్యకు విన్నవించామన్నారు. అంతకు ముందు ఆయన తిరుమణి ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకీరాం, సీఐ గిరీశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ర్యాపిట గ్రామంలో సోలార్ రైతుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, జిల్లా కలెక్టర్ శుభ కళ్యాణ్ మాట్లాడారు. ర్యాపిట గ్రామ పంచాయతీ రైతులు తమ భూములను లీజ్ పద్ధతిలో ప్రభుత్వానికి అందిస్తే మరో 2 వేల మెగా వాట్స్ సామర్థ్యం గల సోలార్ పార్కును నిర్మిస్తామన్నారు.

వైభవంగా దుర్గమ్మ జాతర



జ్యోతులు మోస్తున్న మహిళలు



అలంకరణలో దుర్గమ్మ

పావగడ: తాలూకాలోని నలిగానహళ్లిలో దుర్గమ్మదేవి జాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన దుర్గమ్మ ఉత్సవ ప్రతిమను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులు మోశారు. 14 సంవత్సరాలుగా దుర్గమ్మ జాతరోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ సమితి సభ్యులు తెలిపారు. జాతరకు తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

పిల్లలందరూ బడిలో ఉండేలా చూడండి

- డీవైఈఓ రంగస్వామి



అమరాపురం ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈఓ రంగస్వామి

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం పెనుగొండ డీవైఈఓ రంగస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? ఇంక ఎంతమంది బడికి రావాల్సి ఉంది? తదితర వివరాలను ఆయా పాఠశాల హెచ్‌ఎం. టి.రఘును అడిగి తెలుసుకున్నారు. 6 నుంచి 14 సంవత్సరాల్లోపు ఉన్న పిల్లలు బడి బయట ఉండకూడదన్నారు. ఉపాధ్యాయులు, సీఆర్పీల సహకారంతో ప్రతి ఒక్కరూ బడిలో ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డులను ఆయన పరిశీలించారు. డైస్ ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'నీట్' పరీక్ష మళ్లీ నిర్వహించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు

పెనుకొండ: నీట్‌లో అక్రమాలు జరిగాయి. మరోసారి నీట్ పరీక్ష నిర్వహించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని ఏఐఎస్‌ఏ జిల్లా అధ్యక్షులు శివకుమార్ డిమాండ్ చేశారు. నీట్‌లో అక్రమాలను నిరసిస్తూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేశారు. తర్వాత అంబేడ్కర్ సర్కిల్లో నిరసన తెలిపారు. ఏఐఎస్‌ఏ జిల్లా అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దుర్వినియోగం, అవినీతి కొత్తది కాదని విమర్శించారు. తాజాగా విడుదలైన నీట్ ఫలితాలపై దేశ వ్యాప్తంగా దీనిపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. నీట్‌ను తిరిగి నిర్వహించాలన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్వతంత్ర సంస్థతో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, రాకేష్, మనోజ్, సురేష్ నాయక్, సందీప్, సాయిరోషన్, గోతం, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ: ఒకరికి గాయాలు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని పులేటిపల్లి క్రాస్ సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒక వ్యక్తి కాలికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటంపల్లికి చెందిన చంద్రాయుడు ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పని నిమిత్తం చెన్నేకొత్తపల్లికి వస్తున్నాడు. పులేటిపల్లి సచివాలయంలో పని చేసే ఉద్యోగి చెన్నేకొత్తపల్లి నుంచి ద్విచక్ర వాహనాంలో వస్తున్నారు. వీరిద్దరూ పులేటిపల్లి క్రాస్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటంపల్లికి చెందిన చంద్రాయుడు కాలికి గాయాలయ్యాయి. వెంటనే 108లో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సంఘాల బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ నాగరాజు

అమరాపురం: మండలంలోని మహిళా సంఘాల సభ్యులు తమ సంఘాల బలోపేతానికి కృషి చేయాలని మడకశిర వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు లలితమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏసీ.నాగరాజు మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, ఉన్నతి, సీఐఎఫ్, శ్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. బుక్ కీపర్లు, యానిమేటర్లు, సీసీలు క్షేత్ర స్థాయిలో సంఘాల పనితీరును పరిశీలించి సంఘ సభ్యులకు రుణాల వినియోగం, రికవరీ, తదితర వాటిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్క సంఘం ఆర్థిక లావాదేవీలను మెరుగు పరచుకోవాలని సూచించారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసుకున్న సంఘాలకు రుణాలను త్వరితగతిన ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్క మహిళా తాము తీసుకున్న రుణాలతో చిన్న చిన్న వ్యాపారాలు, విద్యార్థుల చదువుల కోసం ఖర్చు పెట్టాలన్నారు. కొంత మేర పొదుపు చేసుకోవాలని సూచించారు. రక్తహీనత వలన జరిగే అనర్థాల గురించి మహిళలకు అవగాహన కల్పించాలని ఆయన వీఓ లీడర్లు, వీఓఏలకు సూచించారు. కార్యక్రమంలో సీసీలు, వీఓఏలు, హేమ మండల కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో శాంతినాథ్ మహారాజ్



జైన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: స్థానిక కంసలపేట ప్రాంతంలో ఉన్న జైన మతస్తుల శాంతినాథ్ మందిరంలో బుధవారం ఆలయ మూడవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆగమ్ శేఖర్ విజయ్ జీ చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో భగవాన్ శాంతినాథ్ మహారాజ్ విగ్రహానికి అభిషేకాలు చేశారు. తర్వాత తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. హిందూపురం జైన్ సంఘం సభ్యులు బాబూలాల్, చారు కీర్తి, విమల్, కల్పేష్, అనిల్, నాగేంద్ర కుమార్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖరరెడ్డి



నూతనంగా ఎంపికైన పదాధికారులు

పావగడ: స్థానిక తాలూకా కాంట్రాక్టర్ల సంఘం నూతన అధ్యక్షుడిగా బెళ్లిబెట్లు చంద్రశేఖరరెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆయనతో పాటు స్థానిక మాజీ మున్సిపల్ చైర్మన్, క్లాస్ వన్ కాంట్రాక్టర్ ఏ శంకరరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పట్టణంలోని అతిథి గృహంలో బుధవారం కాంట్రాక్టర్లు సమావేశమమై అందరి ఏకాభిప్రాయంతో నూతన పదాధికారులను ఎంపిక చేశారు. సంఘం ఉపాధ్యక్షుడిగా గంగప్ప, ప్రధాన కార్యదర్శిగా డీబీ లోకేశ్ పాశేగార్, సహ కార్యదర్శిగా తిమ్మరాజ్, ట్రెజరర్‌గా పాలనాయక్ ఎంపికయ్యారు. వీరితో పాటు డైరెక్టర్లుగా భాస్కర నాయుడు, సిమెంట్ రామాంజినప్ప, ఈరారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రమేశ్, మంజునాథ్, మారెప్ప తదితరులను ఎంపిక చేశారు.

విస్తారంగా వర్షాలు



సోమందేపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం



పెనుకొండలో కురుస్తున్న వర్షం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు గంట పాటు తెరిపి లేకుండా వర్షం రావడంతో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. వర్షం రావడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.

పెనుకొండ: పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో బుధవారం ఉదయానికి 278.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు డివిజనల్ గణాంకాధికారి మల్లికార్జున తెలిపారు. మడకశిర 68.4, రొద్దం 3.4, అమరాపురం 30.4, గుడిబండ 15.2, రొళ్ల 5.4, పరిగి 22.4, సోమందేపల్లి 2.2, హిందూపురం 74.6, లేపాక్షి 36.8, చిలమత్తూరు 18.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

చిలమత్తూరు: మండలంలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు కర్ణాటక రాష్ట్రంలో కూడా కురుస్తున్న వర్షాలతో మండలంలో ప్రవహించే కుషావతి నదికి నీరు వచ్చి చేరుతోంది. రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో నది పూర్తిగా ఎండిపోయింది. అయితే ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు నదిలో భారీగా వరద నీరు చేరుతుండటంతో బోరు బావులు రీచార్జ్ అవుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే రైతులు ఖరీఫ్ సాగు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. సాధారణంగా మండలంలో మొక్కజొన్న , వేరుశనగ పంటలను ఖరీఫ్‌లో పండిస్తారు. మంగళవారం రాత్రి 18.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

లేపాక్షి: రెండు రోజులుగా కురిసిన వర్షానికి లేపాక్షి మండలంలో 73.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సోమవారం మండల వ్యాప్తంగా 36.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా మంగళవారం 36.8 మిమీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయాశాఖ అధికారిణి శ్రీలత పేర్కొన్నారు. అయితే రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వంకలు, పారం పొండ్లు, చెక్‌డ్యాములు వర్షపు నీటితో నిండాయి. దీంతో రైతులు విత్తనాలు విత్తుకోవడానికి చాలా అనువుగా ఉందని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా గొర్రెలు, మేకలు, పశువులు తినడానికి మేత కూడా పెరుగుతుందని చెప్పారు.

హిందూపురం టౌన్: పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం వివిధ మండలాల్లో భారీ వర్షాలు కురవగా హిందూపురంలో అత్యధికంగా 74.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా 278.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చిలమత్తూరు మండలం లాలేపల్లి వద్ద కుషావతి నదిలో పారుతున్న నీళ్లు



లేపాక్షి: వర్షానికి నిండిన ఫారంపాండ్



హిందూపురం పట్టణంలో వర్షం కురుస్తున్న దృశ్యం

జూలై 1న బంజారా సమ్మేళనం

పుట్టపర్తి టౌన్: 'మా తండాలో మా రాజ్యం.. ఎంత మంది ఉన్నామో అంత వాటా' నినాదంతో జూలై ఒకటో తేదీన హైదరాబాద్‌లో బంజారాల సమ్మేళనం నిర్వహించనున్నట్లు లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్‌నాయక్ తెలిపారు. బుధవారం పుట్టపర్తి ప్రశాంతి గ్రామంలోని సమితి కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రవినాయక్ అధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కైలాష్ నాయక్ హాజరై మాట్లాడారు. గిరిజనుల హక్కుల సాధన, వారి సమస్యల పరిష్కారం కోసం లంబాడీ హక్కుల పోరాట సమితి 1997 జూలై 1న ఆవిర్భవించిందన్నారు. 26 సంవత్సరాలు పూర్తి చేసుకొని 27వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జూలై ఒకటో తేదీన హైదరాబాద్‌లో బంజారాల సమ్మేళనం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి లంబాడీ మేధావులు హాజరవుతారన్నారు. గిరిజన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ నాయక్, నాయకులు నాగరాజునాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.